**ఆకాశవాణి : : హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 03.06.2024** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. తెలంగాణ అంతటా 17 పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలో రేపు జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం అధికార యంత్రాంగం పకడ్బంధి ఏర్పాట్లు చేసింది.

2. దశాబ్దాల పాటు సాగిన పోరాటం వల్లనే తెలంగాణ వచ్చిందని మాజీ మంత్రి, BRS ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

3. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ రిమాండ్ను రౌస్ అవెన్యూ కోర్టు జులై 3వ తేదీ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

4. ఉపరితల ఆవర్తనం కారణంగా ఇవాళ, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియచేసింది.

----------------

**COUNTING**

పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం 17 నియోజక వర్గాల పరిధిలో అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావు లేని విధంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని రిటర్నింగ్ అధికారులు తెలియచేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, సాయంత్రం 4 గంటల వరకు ఫలితాలు పూర్తి స్థాయిలో వెలువడే అవకాశం ఉందని రాష్ట్రముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే నిబంధనల పరిధిలో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల సంఘం పాస్ లు ఉన్న వారికి మాత్రమే ఓట్ల లేక్కింపు కేంద్రాల్లోకి అనుమతిస్తామని వెల్లడించారు. ( SHANKAR)

----------------

**NLG COUNTING**

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లతో సిద్దంగా ఉన్నామని నల్లగొండ జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు. నల్లగొండ కౌంటింగ్ కేంద్రంలో ఈరోజు సిబ్బందితో కలిసి మాక్ కౌంటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాయంత్రం 4 గంటల లోగా కౌంటింగ్ పూర్తిచేసి ఫలితాలు వెల్లడిస్తామని, ఫలితాలు ప్రకటించిన తర్వాత ర్యాలీలు, రోడ్ షోలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.(PTC)

----------------

**KHAMMAM**

ఖమ్మం లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఆయన

పరిశీలించారు. లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల లెక్కింపుకు ఏడు హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ల కోసం మరో హాల్ సిద్ధం చేశామన్నారు. (PTC)

----------------

**KARIMNAGAR**

కరీంనగర్ లో పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను కౌంటింగ్ అబ్జర్వర్ జీ. నజ్మా పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫలితాల ప్రకటనలో ఎలాంటి జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. (PTC)

----------------

**NIZAMABAD**

నిజామాబాద్ జిల్లా డిచ్పల్లిలోని పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఎలాంటి గందరగోళానికి తావులేకుండా, పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. (PTC)

----------------

**SIDHIPET – HARISH RAO**

దశాబ్దాల పాటు సాగిన పోరాటం వల్లనే తెలంగాణ వచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను నిజం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సిద్దిపేటలో ఆయన బిఆర్ఎస్, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ

సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... ఉద్యమంలో నిస్వార్థంగా సేవ చేసిన వారిని గుర్తుంచుకోవడం నిజమైన పండగ అని తెలిపారు. (PTC)

----------------

**బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు**

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ భవనంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, జాతీయ జెండా ఆవిష్కరించి, అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. **PTC, ASF**

----------------

**KTR**

రాష్ట్రంలో కరెంట్ కోతల పరంపర కొనసాగుతూనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు విమర్శించారు. తెలంగాణలో కరెంట్ కోతలు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 24 గంటల వ్యవధిలోనే కరెంట్ కోతలకు నిరసనగా ప్రజలు రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నారని ఎక్స్ సామాజిక మాధ్యమం వేదికంగా తారక రామారావు తెలియచేశారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో రాత్రి కరెంట్ లేక సబ్ స్టేషన్ ముందు ప్రజలు ధర్నాలు చేశారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని తారకరామారావు ప్రశ్నించారు. (Desk)

----------------

**MLC KAVITHA**

ఢిల్లీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది. మరో నెల రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. ప్రస్తుతం

తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత కస్టడీ ఇవాళ్టితో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆమెను కోర్టు ముందు హాజరుపరచగా రౌస్ అవెన్యూ కోర్టు ఈడీ కేసులో కవితకు జులై 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ తీర్పునిచ్చింది. ఇప్పటివరకు 14 రోజులు మాత్రమే పొడిగిస్తూ రాగా, ఈసారి ఏకంగా నెల రోజుల పాటు పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. (Desk)

----------------

**FORMATION DAY CELEBRATIONS**

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు ఘనంగా జరిగాయి. 'పదేళ్ల పండుగ' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ముందుగా ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. గవర్నర్ రాధాకృష్ణన్ సైతం వేడుకలకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులతో సహ ప్రభుత్వప్రధానకార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవిగుప్తా పాల్గొన్నారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను, వైభవాన్ని చాటి చెప్పేలా 17 రకాల కళారూపాలు ప్రదర్శించారు. మరోవైపు వేడుకలు జరుగుతున్న సమయంలో వర్షం పడటంతో సాంస్కృతిక కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడినప్పటికీ, ఘట విన్యాసం, ఒగ్గుడోలు, బోనాల కోలాటం, గుస్సాడీ, బతుకమ్మ తదితర కళారూపాల ప్రదర్శన ఆద్యంతం కన్నుల పండువగా సాగింది.(Desk)

----------------

**MULUGU**

ములుగు జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ వ్యక్తి మృతి చెందాడు. వాజేడు మండలం కొంగాలగుట్టపై ఈ ఘటన జరిగింది. ఈ రోజు ఉదయం ముగ్గురు వ్యక్తులు కట్టెల కోసం అడవికి వెళ్ళారు. అయితే పోలీసులను హతమార్చడంకోసం మావోయిస్టులు పెట్టిన మందుపాతర పేలి జగన్నాథపురం గ్రామానికి ఏసు చనిపోయాడు. ఇదే గ్రామానికి చెందిన రమేశ్, ఫకీర్ గాయపడ్డారు. అడవుల్లో మందుపాతర పేలడంతో ఏజెన్సీ ప్రాంత పోలీసులు అప్రమత్తం అయ్యారు. (PTC)

----------------

**వాతావరణం**

ఉపరితల ఆవర్తనం కారణంగా ఇవాళ, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుండి 50 కిలో మీటర్ల గాలులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు అప్రమత్తత జారీ చేసింది. మరో రెండు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపింది.(PN)

----------------

**వాన జల్లులు**

జనగామ జిల్లాను నిన్న తొలకరి వాన జల్లులు పలకరించాయి. మూడు నాలుగు రోజులుగా ఉక్కపోత వాతావరణం జిల్లా ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది.. జిల్లాలోని జఫర్గడ్ లో 39 మిల్లీ మీటర్లు, తాటికొండలో 36.3, మల్కాపూర్ లో 28.3, అబ్దుల్ నాగారంలో 21.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైనట్లు జనగామ జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.PTC

----------------

**CHILDREN DIED IN WALL COLLAPSE**

రంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. గోడ కూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మరో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. జిల్లాలోని మైలార్దేవ్పల్లి పరిధిలోని బాబుల్రెడ్డి నగర్లో చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలింది. దీంతో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. (desk)

----------------

**TOLL CHARGES – NLG**

జాతీయ రహదారులపై పెరిగిన 5 శాతం టోల్ చార్జీలు గత అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా లతో పాటు బిబినగర్, మాడ్గులపల్లి వద్ద పెరిగిన చార్జీలను వసూలు చేస్తున్నారు. పెంచిన చార్జీలు వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటాయని జాతీయ రహదారుల సంస్థ అధికారులు తెలిపారు. (PTC)

----------------